ఒకే రక్తం

సులోచన దూరంగా చూస్తోంది.

కదిలే రైలులోంచి చూస్తోంటే ప్రకృతికి చైతన్యం వచ్చినట్టు తోస్తోంది. కాల చక్రం ముందుకు కదులుతోంది. ప్రకృతి వెనకి, కదులుతోంది.

"అమ్మా! అమ్మా"

సులోచన ప్రక్కకు తిరిగిచూచింది.

బేబీ! అయిదేళ్ళబేబీ! సన్నగా రోజ్ కలర్ బొమ్మలాంటి తన బేబీ!

"ఏమిటమ్మా?" అడిగింది సులోచన. ఆమె చేతులు ఆప్యాయంగా బేబీ తల నిమురుతోన్నాయి.

"చెట్లు నిజంగా కదులుతోన్నాయా అమ్మా?" అడిగింది బేబీ.

"రైలు కదులుతోందికదా! అందుకే మనకి చెట్లు వెనక్కి పరుగెత్తినట్టు అని పిస్తుంది అంతే!"

"సైన్సు చెబుతోన్నావా బేబీకి?"

సులోచన తలెత్తింది. రాజశేఖరం పత్రిక చదువుకుంటూన్న వాడల్లా ఆగాడు,

"ఎంతయినా సైన్సు మా పారి అమ్మాయికదా!"

రాజశేఖరం కూతురును ఒడిలోకి లాక్కున్నాడు కిటికీలోంచి గాలిహాయిగా తగులుతోంది.

"కాన్వెంటులో మాట్లాడి వుంచారా?" అడిగింది సులోచన.

"సీటు యిస్తారు-ఒకటి రెండునెలలు ఓపిక పట్టాలి" మాటలను గాలి తోసుకు పోతోంది.

"నన్ను నువ్వు రోజూ స్కూటర్‌తో దింపి రావాలి" బేబీ తండ్రిచెవులు నిమురు తోంది.

"తప్పకుండా!" కూతురును గుండె లకు అద్దుకుంటున్నాడు రాజశేఖరం.

సులోచన తేలికగా వూపిరి పీల్చింది.

పల్లెటూరి బాధ వదిలింది. తన భర్త ఎం. ఎస్. సీ. చదివి కూడా యింటి దగ్గరే వుండిపోతానన్నాడు. పల్లెటూరిలో జీవితం ఏముంది? ఎదుగూ బొదుగూలేని జీవితం. మార్పు లేని దినచర్య. రాజశేఖరం వాటికిఏదో ప్రతివాదనలుచేశాడు.

"నా మాట ఎప్పుడు లక్ష్యపెట్టారు

గనక?" అంది తాను.

రాజశేఖరం విడ్డూరంగా చూశాడు.

"సులోచనా నీ మాటలు విడ్డూరంగా ఉన్నాయి. మనకి ఇక్కడ ఆస్తిపాస్తులున్నాయి. వాటిని సంరక్షించుకుంటూ వుండవద్దా?"

"ఆ మాత్రానికి మీరు ఎం. ఎస్. సీ చదివి వుండనక్కర్లేదు"

"అంటే?"

"మా నాన్నను పీడించుకుతిన్నారు,



ఆయన ఏవో తిప్పలు పడ్డారు. ఇప్పుడు ఆ డిగ్రీని మూలనుపెట్టేస్తారా?"

"మీ నాన్న నన్ను చదివించారనే కదా చెప్పుతున్నావు?" రాజశేఖరం కఠినంగా అడిగాడు.

"ఉపయోగం లేనినాడు సీటుకుఅంత తాపత్రయంపడటం ఎందుకు!"

"నాకు కెమిస్ట్రీ చదవాలని........"

"పొలం గట్టుమీద మీ అమ్మాయి తిరగాలని...."

"సులోచనా!"

"అవునండి. ఆలోచించండి. మనకి బేబీతోపాటు మరో బాబో పాపో పుడతారు. వాళ్ళు ఇక్కడ మట్టి తొక్కుకుని నూతిలో కప్పల్లాగా...." వెక్కుతోంది తాను.

రాజశేఖరం ఆలోచనలోపడ్డాడు.

ఆచరణకు నడుంకట్టాడు.

ఫలితంగా అతడు ఎక్కడ చదువుకున్నాడో అక్కడే ఉద్యోగంవచ్చింది.

"ఏమిటో దీర్ఘంగాఆలోచిస్తోన్నావు?" రాజశేఖరం మోచేత్తో పొడిచాడు.

సులోచన ఆలోచనలు కొలిక్కి తగిలాయి.

భర్తవంక ఆప్యాయంగా చూచింది. పరిస్థితులన్నీ కలిసివస్తే తనకి మరో ఎనిమిదినెలల్లో ప్రసవం వస్తుంది. తమ సంసారం అప్పటికి విశాఖపట్నంలో



పునాదులు వేసుకుంటుంది.

బేబీ లోయర్ కె.జి. చదువుతోంటుంది.

"ఆలోచనలా-ఏమీ లేవు. కొత్త జీవితం ఎలాఉంటుందో...."

"ఏం-బాగానే ఉంటుంది. నువు కోరుకున్న జీవితమే కదా!"

"అంటే మీకు పూర్తిగా ఇష్టంలేదా?"

"ఎందుకు లేదు? నువు ఎక్కడ ఉంటే అక్కడే!" సులోచన పులకరించింది.

తమని ప్రయాణీకులు పట్టించుకోవడంలేదు. సులోచన ఆ విషయం గమనించింది. రాజశేఖరాన్ని మెల్లగా గిచ్చింది. ఆతడు ఆమె చేతిని అందిపుచ్చుకున్నాడు.

రైలు వాల్తేరు స్టేషన్‌లో ఆగింది.

రాజశేఖరం టాక్సీ మాట్లాడాడు.

హౌసింగ్ బోర్డు కాలనీలో తమ

ఇంటికి చేరుకునే సరికి మధ్యాహ్నం రెండైంది.

సులోచన వంటచేసింది.

బేబీ నిద్రకుపడింది.

"కాస్త మీరు అటూఇటూ తిరిగిరండి. పనిమనిషిని ఏర్పాటుచేసుకోవాలి" అంది సులోచన

"ఆల్ రైట్! నాకు తెలిసిన వాళ్ళ దగ్గరకు వెళ్తాను. ఇల్లుజాగ్రత్త!" రాజశేఖరం రోడ్డెక్కాడు.

సాయంకాలంవరకూ తిరిగాడు. కాని తగిన పనిమనిషి దొరకలేదు తన స్నేహితులకు చెప్పి తిరిగివచ్చాడు రాజశేఖరం

సులోచన ఎవరితోనో మాట్లాడుతోంది.

రాజశేఖరాన్ని చూస్తూనే, "రండి. ఈవిడ మన ఇంట్లో పనికి కుదిరింది!" అంది సులోచన.

రాజశేఖరం బరువు దిగినట్టు ఫీలయ్యాడు.

"ఏమైనావుంటే పడవేయండమ్మా!" అంది పనిమనిషి. పమిట బిగించి.

రాజశేఖరం ఆమెవంక విచిత్రంగా చూశాడు.

ఆమెను చప్పున చూచి ఎవరూ పని మనిషి అనుకోరు. వీరాబ్లవుజూ మాచింగ్ వేసింది. చేతులకు రెండేసి బంగారు గాజులు, మెడలో బంగారు నల్లపూసల దండ. మొహంలో కలిగిన వాళ్ళకళ! మాటలో నాజూకు తనం. చిన్నతిలకం బొట్టు!

సులోచనా ఆమె పెరట్లోకి వెళ్ళారు. ఆ రాత్రి అంది సులోచన.

"కాంతం భలే మనిషండి!"

"కాంతమా? ఎవరు?" అడిగాడు రాజశేఖరం

"మీదంతా చోద్యం! మనకి పనిలో కుదిరింది కదా! ఆమె"

"ఏది? ఎలాంటి మనిషి?"

"ఆమెను చూస్తోంటే పని మనిషి అనిపించదు అవునా?"

"కావచ్చు. పట్నం నాగరికత!"

"సిటీలో ఆమచూడని సినిమాలేదట!"

"ఆమెను చూస్తేనే ఆవిషయం అర్థమవుతుంది!"

"వెనకా ముందూ ఎవరూ లేరట! భర్త చనిపోతూ యిచ్చిన సొమ్ములతో నెట్టు కొస్తోందట!"

రాజశేఖరం నవ్వి ఊరుకున్నాడు.

మర్నాడే యూనివర్శిటీలో తనఉద్యోగానికి జాయినింగ్ రిపోర్ట్ యిచ్చాడు.

కొత్తలో బేబీ తనతల్లిని అంటిపెట్టుకుని వుండేది. క్రమంగా కాంతానికి చేరిక అయింది.

రోజులు గడిచేకొద్ది బేబీకి కాంతంతో సన్నిహితత్వం పెరిగింది.

"కాంతం వచ్చాక నాకుపని సుఖమయింది." అన్నది సులోచన. రాజశేఖరం అప్పుడే వచ్చాడు, ఆమె మాటకు తలూపాడు. సులోచన అతడికి కాఫీ అందించింది.

రాజశేఖరం కాఫీ త్రాగుతూ పడక కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమండి? అలా వున్నారేం?"

"ఏమిలేదు సులోచనా? ఆఫీసు పని ఒత్తిడి!"

"పని ఎక్కువగా-వుందా?"



"పని తక్కువే! ఒత్తిడి ఎక్కువ."

"అదేమిటి?"

"సులోచనా! యూనివర్సిటీలో అంతా చదువుకున్న వాళ్ళే, మేధావులే! అయితే వాళ్ళ మేధస్సుకు కులం నకెళ్ళు!" రాజశేఖరం విచారంగా అన్నాడు

"కులం"-కులం మర్చిపోని చదువులన్నమాట!"

"ప్చ్....విజ్ఞానానికి కులం! ప్రతిభకు కులం! ప్రమోషన్‌కి కులం! హెడ్‌షిప్‌కి కులం! ఈ కులం కుళ్ళుతో విద్యార్థుల బుర్రలు కుళ్ళుపట్టిపోతున్నాయి పాపం! తరాలుపాతద్యే కుళ్ళు"

గుమ్మందగ్గర అలికిడయింది.

భార్యాభర్తలు తలలు త్రిప్పిచూశారు.

బేబీ నీరసంగా లోపలకు వస్తోంది.

"బేబీ! ఏముందమ్మా?" అడిగాడు రాజశేఖరం.

సులోచన చటుక్కున లోపలకు పరుగెత్తింది పాలగ్లాసుతో తిరిగి వచ్చింది.

బేబీ మౌనంగా పాలుత్రాగింది తండ్రి ఒడిలో చేరబడింది. నిస్త్రాణగా కళ్లు మూసుకుంది.

"ఎప్పటినుండిఇలావుంది?" అడిగాడు రాజశేఖరం.

సులోచన నుదురు చిట్లించింది. "మధ్యాహ్నం ఆటకి బాగానే వెళ్ళింది" అంది.

బేబీ చిరుగుటాకులాగా వణుకుతోంది, చిరుచెమటలు పట్టాయి.

"ఇంటిలాగా ఉండేపిల్ల! సడన్‌గా బుగ్గలు వల్చబడ్డాయి." సులోచన గొంతు పూడుకుపోయింది.

రాజశేఖరం కూతురును మంచంమీద పడుకోబెట్టాడు.

మూడిళ్ళకి అవతలగా లేడీడాక్టర్ వుంది, ఆమెను పిలుచుకు వచ్చాడు.

లేడీడాక్టర్ వచ్చేటప్పటికి బేబీ నిద్రపోతోంది.

లేడీ డాక్టర్ పాపను పరీక్షించింది.

"జనరల్ వీక్‌నెస్. అంతే! పళ్ళూ, ఆకు కూరలూ బాగా వాడండి. ఆకలికి మందు రాస్తాను." అంది లేడీ డాక్టర్.

"ఆకలి బాగానేవుందిడాక్టర్! వెర్రిగా తింటుంది" అన్నాడు రాజశేఖరం

బేబీ డాక్టర్ తలపూపి మందులు రాసింది.

బేబీ మర్నాటి ఉదయానికి తేరుకున్నది.

రాజశేఖరం నిశింతగా డిపార్ట్‌మెంటుకు బయలు దేరాడు.

కాంతం మధ్యాహ్నం వరకూ బేబీ దగ్గరే వుండిపోయింది. సాయంకాలం రాజ శేఖరం వచ్చాడు.

బేబీని చూచి వెర్రెత్తి పోయాడు. ఆమె చేతులకు వెంట్రుకల త్రాళ్లు కట్టి వున్నాయి. మెడలో తాయెత్తు. నుదుటను రూపాయి బిళ్ళలాంటి సిందూరం బొట్టు, బేబీ వరండాలో ఆడుకుంటోంది.

"సులోచనా? అరిచాడు రాజశేఖరం.

సులోచన కంగారుగా పరుగెత్తుకు వచ్చింది.

"బేబీకి యివన్నీ ఎవరు కట్టారు?"

"కాంతం!" అంది సులోచన తెల్లబోయి.

"నాన్సెన్స్" రాజశేఖర్ం బేబీదగ్గర కూర్చున్నాడు. చేతులకూ మెడకూ వున్న తాళ్ళు విప్ప బోయాడు.

సులోచన అతడిని వారించబోయింది.

"ఏమిటి, నీకూ ఈ మూఢ నమ్మకాలున్నాయా?" రాజశేఖరం మొహం కందగడ్డలాగా అయింది.

"నాకు నమ్మకం లేదండీ! కాని ఈ వెంట్రుకల తాళ్లు వున్నంత మాత్రాన నష్టంలేదు కదా!"

"అదో వెనులు బాటు! ఈ నమ్మకాలకు ప్రోత్సాహం!"

"ఏపుట్టలో ఎం పాముందో"

"నాన్సెన్స్! నావృత్తికే అపచారం! చెప్పేది సైన్సు! ఆచరణలో చాదస్తం!"

రాజశేఖరం చటుక్కున బ్లేడు అందుకున్నాడు. తాళ్లు కట్ చేశాడు. వాటిని ఉంగ చుట్టి ప్రహరీమీద నుండి విసిరేశాడు.

"ఎంతపని చేశారు బాబుగారూ!"

రాజశేఖరం తలెత్తి చూశాడు.

గోడకి అవతల కాంతం. తాళ్లు అందుకుంది ఆమె,

"కాంతం! నువ్వేమిటో నీవనేమిటో అంతే! హద్దు మీరక!"

కాంతం తలవొంచు కుంది.

రెండువారాలలో బేబీ బాగుపడింది.

పూర్వంలాగా ఒళ్ళు చేసింది.

○ ● ○ ○

రాజశేఖరం స్కూటర్ ఆపాడు.

ఉత్సాహంగా ఇంట్లోకి నడిచాడు.

సులోచన పడకగదిలో మంచంమీద వుంది. మంచం ఇవతల కాంతం నిలబడి వుంది. ఆమె బత్తాయి తొనలు ఒల్చుతోంది.

బేబీ సోఫాలో కూర్చుంది. బొమ్మలు చూసుకుంటోంది.

"సులోచనా! ఏమయింది?" అడిగాడు రాజశేఖరం.

సులోచన మౌనంగా రోదిస్తోంది.

కాంతం తొనలు అందిస్తోంది.

"బాబుగారూ! మీరు తొందరపడ్డారు" అంది కాంతం.

"తొందరా? ఏమిటి?" రాజశేఖరం వింతగాచూశాడు. కాంతం తనతో అదే రెండోసారి మాట్లాడటం!

ఈ ఇంట్లో ఏదో దుష్టశక్తివుంది.



పాపమీద కనిపించింది. చివరకు మీమీద పగ తీర్చుకుంది!"

"నాన్సెన్స్.... సినిమా డైలాగులు కట్టిపెట్టు. సులోచనా! చెప్పు! ఏమయింది?"

"ఎబార్షన్!"

"ఎబార్షనా? ఎలా? ఎందుకయింది? ఏం చేశావు?"

"ఏంచేస్తానండి? పాప బట్టలు ఉతుకుతోంటే...."

"కాంతం ఏమయింది?"

"ఆమె మ్యాట్నీకి వెళ్ళిందట."

"వచ్చేవరకూ ఆగలేకపోయావా?"

సులోచన మౌనంగా ఏడుస్తోంది.

రాజశేఖరం పెదిమలు బిగించాడు. ఆరోగ్యం బాగావున్న సులోచనకి గర్భస్రావం కావడం ఏమిటి?

దుష్టశక్తి ప్రభావమా? నిజంగా ఈ ఇంట్లో ఏదయినా దుష్టశక్తి వుందా?

సైన్సుకీ ఈవాదస్తాంకీ లంకె ఎక్కడ? లేక పోతే దేని దారిన అది తన వునికిని ప్రతిష్ఠించుకోవడమేనా? అటో పక్షమూ.....ఇటో పక్షమూ.... ఈ పోరాటం ఎంతకాలం? రాజశేఖరం తల విదిలించాడు.

"లేడీ డాక్టర్ను పిలుచుకురానా?" అడిగాడు రాజశేఖరం.

"ఇందాకనే వచ్చి వెళ్ళింది. ఇంజక్షన్ యిచ్చింది. మాత్రలు తెప్పించుకొమ్మంది. కాంతం తెచ్చి పెట్టింది."

కాంతం వంటచేసి పెట్టి వెళ్ళిపోయింది.

సులోచనకు ఆ రాత్రి రక్తస్రావం మొదలయింది.

లేడీ డాక్టర్కి రాత్రంతా సులోచన బెడ్ వద్దనే గడిచింది. రాజశేఖరం బేబీని నిద్ర పుచ్చి గదిబయట కూర్చున్నాడు. వాకిట్లో టప్మని శబ్దమయింది.

రాజశేఖరం వాకిట్లో లైటువేసి బయటకు నడచాడు.

వాకిట్లోపడి వున్న వస్తువును చూచి తెల్లబోయాడు.

నిమ్మకాయ. ఎర్రటి బొట్టుపెట్టివుంది, దాని మధ్యలో సన్నపాటి తీగగుచ్చివుంది, తీగకు రెండు ఎండు మిరపకాయలు తగిలించి వున్నాయి.

రాజశేఖరం గేటుదాటి పరుగెత్తాడు.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

చీకట్లో ఎవరో నవ్వి నట్టుయింది, ఎక్కడో గాజుల గలగల! రాజశేఖరం తిరిగి యింట్లోకి వచ్చాడు.

సులోచన బాత్ రూంలో వుంది.

"బట్ట తడిసి పోతోంది!'' అంది లేడీ డాక్టర్.

"కాంతాన్ని పిలిపించండి" అంది సులోచన నీరసంతో.

రాజశేఖరం స్కూటర్ తీశాడు.

ముందు చక్రం నిమ్మకాయను తొక్కింది.

స్కూటర్ రోడ్డెక్కింది.

కాంతంయింట్లోనే దొరికింది. ఆమెను యింటికి రమ్మని కబురు చెప్పి తిరిగి యింటికి వచ్చేశాడు.

"ఎందుకయినా మంచిది! మీవాళ్ళకు తెలియపరచండి!" అంది లేడీ డాక్టర్.

రాజశేఖరం పోస్టాఫీసుకు బయలుదేరాడు.

టెలిగ్రాంఇచ్చివచ్చేసరికి సులోచనను జనరల్ ఆస్పత్రికి తరలించారు. బేబీ ప్రక్కఇంటి వాళ్ళవద్ద నిద్రపోతోంది.

ప్రక్కింటి వాళ్ళకు కబురు చెప్పి సులోచనవెంట వెళ్ళింది కాంతం.

ఆసుపత్రిలో సులోచన కోమాలో వుంది.

రాజశేఖరానికి పిచ్చిగావుంది, మనసు పరిపరి విధాలా పోతోంది. దుష్టశక్తి వుండటం నిజమా? అది తనమీద పగబట్టిందా? తాను ఏం అపకారం చేశాడు. తాను దిగిన ఇంట్లో దుష్టశక్తి కాపురం వుందా? తాను కాపురంపెట్టి దానికి అపకారం చేశాడా?

రాజశేఖరం విసుగ్గా తలవిదిలించాడు

మన మనస్సు బలహీనమై వుంది. సులోచనకు కష్టంవచ్చింది. దానికితాను తట్టుకోలేకపోతున్నాడు. అందుకే మనసులో సైతాను తిష్టవేస్తున్నాడు.

నాన్సెన్స్....శనీలేదూ సైతాన్‌లేదూ.

రాజశేఖరం తన జుత్తులోకి వ్రేళ్ళు పోనిచ్చుకున్నాడు. తలను వ్రేళ్ళతో దువ్వుకున్నాడు.

గైనికాలజీ చీఫ్‌ను కలిశాడు.

ఆమెకు ముడుపుకట్టి ప్రసన్నం చేసుకున్నాడు.

"రక్తం పోయింది. ఆమె గ్రూపు రక్తం దొరకాలి, బ్లడ్‌బాంక్‌లో అడిగి చూడండి?" అన్నది చీఫ్.

రాజశేఖరం అటు పరుగెత్తాడు.

"ఎబి" గ్రూపు రక్తం బ్యాంకులో లేదు.

రాజశేఖరానికి ఆసుపత్రి మీదా, ప్రభుత్వంమీదా మండుకొచ్చింది.

డబ్బుఖర్చుపెట్టగల తనకే యిన్ని ఇబ్బందులు ఎదురయితే బీదల గతి ఏమిటి? రక్తం వాళ్ళకు ఎక్కడదొరుకుతుంది?

ఉదయాన్నే రాజశేఖరం తండ్రీ సులోచన వాళ్ళ తల్లీ దిగారు.

రాజశేఖరానికి ఊపిరిసలిపినట్టయింది కొండంత అసరా దొరికినట్టయింది.

సులోచననూ బేబీ వాళ్ళనీ వాళ్ళకి వదిలిపెట్టాడు. తాను రక్తంకోసం వేట మొదలు పెట్టాడు.

ఎవరో అనుభవజ్ఞుడు చెప్పాడు దండు బజారులో ప్రహ్లాద మందిరం వెనక రక్తం అమ్ముతారని.



రాజశేఖరానికి అడ్రసు సులువుగానే దొరికింది.

రక్తం అమ్మే అతడు సంగతి విని పెదిమ విరిచాడు. రాజశేఖరం క్రుంగిపోయాడు.

తమ బంధువుల రక్తం తన రక్తం చెక్ చేయించాడు. సులోచనకి తమ ఎవరి రక్తమూ పడదు.

గైనకాలజీ చీఫ్ ఆపరేషన్ వాయిదా వేసింది.

సులోచన పరిస్థితి దిగజారుతోంది.

సులోచన తల్లి జగదాంబ వంటగదిలోంచి బయటకు వచ్చింది.

"బేబీ!" పిలిచింది జగదాంబ.

బేబీ పలకలేదు.

జగదాంబ ఇంటిని వెతికింది. రోడ్ల మీదకూడా మనవరాలు కనిపించలేదు.

ప్రక్కయింటి వాళ్ళను బేబీ గురించి అడిగింది. వాళ్ళకూ ఏమీ తెలియదట.

జగదాంబ చక చక సర్దుకుని ఆస్పత్రికి బయల్దేరింది. బేబీ ఆసుపత్రిలో వుంది. కాంతం దగ్గర వుంది. నీరసంగా కాంతం భుజం మీద తలవాల్చింది.

జగదాంబ మనసు మనసులో లేదు. బేబీకి ఏమయింది?

అప్పుడే వచ్చిన రాజశేఖరానికి బేబీ గురించి చెప్పింది. రాజశేఖరం కళ్ళు చెమర్చాయి.

బేబీ మరల చిక్కిపోయింది. మొహం కళ తప్పింది. ఎందుకు జరుగుతోంది? ఎలా జరుగుతోంది?

రాజశేఖరం కూతురును ఆసుపత్రిలో చూపించాడు జనరల్ వీక్‌నెస్!

రాజశేఖరానికి దుఃఖం ముంచుకు వస్తోంది.

ఉదయం బంతిలాగా వున్న బేబీకి జనరల్ వీక్‌నెస్ ఏమిటి?

వైద్య శాస్త్రం యింత పనికి మాలినదా?

రాజశేఖరం తల పట్టుకున్నాడు.

ఒకవైపు తన భార్యా రెండోవైపు తన కూతురూ.

తన బతుకు ఏంకానున్నది?

"బాబుగారూ!"

తలెత్తిచూశాడు. కాంతం!

"ఏంకావాలి?" అడిగాడు రాజశేఖరం.

"రక్తంకోసం వెళ్ళరా?" అడిగింది కాంతం.

నిరాశగా తలూపాడు రాజశేఖరం.

"ఎన్ని సీసాలు కావాలి?"

"కనీసం రెండు సీసాలు!"

"వెయ్యి రూపాయలు ఇవ్వండి!"

"నువు తీసుకువస్తావా?"

"అవును''

"ఎక్కడ నుండి?"

"ఆ విషయం నన్నడక్కండి!"

రాజశేఖరం జేబులోంచి వెయ్యిరూపాయలు అందించాడు.

కాంతం వెళ్ళిపోయింది.

మంచంమీద బేబీ కలవరిస్తోంది.

'కాంతం!వద్దు! సూది!" బేబీ చిగురుటాకులాగా వణుకుతోంది.

రాజశేఖరం చప్పున బేబీవద్ద కూర్చున్నాడు.

"బేబీ! ఏమిటమ్మా?" బుజ్జగించాడు రాజశేఖరం.

''నాన్నా! సూది! అబ్బ!'' ఇంకా కలవరిస్తోంది బేబి

"ఎక్కడమ్మా?"

బేబీ అసంకల్పితంగా ఎడంచేతి మీద కుడిచెయ్యి రాసింది.

రాజశేఖరం ఆమె వ్రేలివద్ద చూశాడు.

ఎడంచేతి మడంవద్ద ఎర్రటి రక్తం బొట్టు!

రాజశేఖరం నుదురు చిట్లించాడు. ఆలోచనల కొనలు అందుతోన్నాయి.

రక్తం బొట్టును గాజువలక మీదకు తీశాడు.

రక్త పరీక్షకు ఇచ్చాడు.

పాప రక్తం 'ఏబి' గ్రూపు.

తల్లిరక్తం గ్రూపు. ఇద్దరిదీ పోజిటివ్! స్కూటర్ ఎక్కాడు. దండుబజారు ఇవతల స్కూటర్ఆపాడు. కాంతం ప్లాస్టిక్ బుట్టతో నడచివస్తోంది.

ప్లాస్టిక్ బుట్టలో రెండు సీసాలు కని పిస్తున్నాయి.

రాజశేఖరం ఆమెను దగ్గరకురానిచ్చి బుట్ట లాక్కున్నాడు.

కాంతం తెల్లబోయింది.

"ఎంతకాలంనుండి ఈ వ్యాపారం?" రాజశేఖరం నిగ్రహించుకుంటున్నాడు. అయినప్పటికీ కోపం పెదిమలు చివర వంకరలు తిరుగుతోంది.

"బాబుగారూ ఏమిటి మీరనేది?"

"నా బేబి రక్తం మార్కెట్‌లో అమ్ముతోన్నావు. నా బేబీ నీకు ఏం అపకారం చేసింది?"

కాంతం మాట్లాడలేదు.

"దుష్టశక్తివున్నట్టు నన్ను నమ్మించి పక్కదారి పట్టించబోయావు. నీకు మేం చేసిన అపకారం ఏమిటి?"

"బాబుగారూ ..."

''నిన్ను నేను ఇప్పుడే చంపగలను. కాని విడిచిపెడతాను. ఎందుకోతెలుసా?"

కాంతం పమిట చెంగుతో నోటికి అడ్డం పెట్టుకుంది.

''నా చేతులతో నేను నా కూతురి రక్తం నా భార్యకు ఎక్కించనివ్వను. నువు ఆ పిల్లరక్తం వ్యాపార వస్తువు చేశావు. వెయ్యిరూపాయలకు ఈరక్తాన్ని కొన్నాను. అంతేకాదు. మనుషుల మెదళ్ళలో ఎలాంటి దుష్టశక్తులుంటాయో నువ్వు తెలియచెప్పావు. అందుకే....... అందుకే.... రాజశేఖరం వెనక్కి తిరిగాడు. అతడి కంఠం రుద్ధమయింది.

కాంతం ఏడుస్తోంది.

చటుక్కున వంగి అతడికాళ్ళు పట్టుకుంది ★